# ధూప

రవి వీరెల్లి



# దూప

రవి వీరెల్లి



DOOPA
Collection of Poems
by
Ravi Verelly

*First Edition :* June 2012

© Author

*Cover Painting :* Mandira Bhadhuri *(University of Chicago)*

*Title Page Painting :* Harshita Mattapalli (Virginia)

Copies : 500

Published by : Eighty Sixers

*Copies available at :*
U.S.A.: Ravi Verelly
6003 Matisse Ln
Roanoke, VA-24018,
ravinder.verelly@gmail.com

India : 8-145/89, Saptagiri Colony
Miyapur, Hyderabad - 5000 049
Phone : 8686059533

All Leading Book Stalls
e.book : www.kinige.com

*DTP & Printing :*
Sri Sri Printers
Vijayawada - 520 002
Cell : 9490634849

*Price :* Rs. 50/-

కాటగలిసిన ఈ అక్షరాన్ని
పొయిరంగా పలకరించి
పదాలగుంపులోకి చేర్చి
కవిత్వంతొవ్వ చూపించిన
ఆకాశమంత స్ఫూర్తి

**అఫ్సర్** గారికి....

# నేల నేర్పిన ఓనమాలు

కవిత్వాన్ని ఎట్లా నిర్వచించాలో ఇంకా తేలలేదు. అది తేలే విషయం కాకపోవచ్చు.

కానీ, కవిత్వాన్ని గురించి అనేక వూహలున్నాయి. ఆలోచనలున్నాయి. దృక్కోణాలూ వున్నాయి. ఫలానా వాక్యం కవిత్వం అవుతుంది అనుకోడానికి కొన్ని మౌలికమయిన కొలమానాలూ వున్నాయి. కానీ, ఈ కొలమానాలన్నీ వొకే తీరుగా లేదా తీర్ కొట్టినట్టుగా వుంటాయని నేను అనుకోవడం లేదు. అవి ఒక్కో కవిని బట్టీ, వొక్కో బాషని బట్టీ... అన్నీటికీ మించి ఆ కవి, ఆ భాష ఆవిష్కరించే వొకానొక జీవన విధానాన్ని బట్టి వుంటాయని నాకు ఇటీవలి కాలంలో కొంచెం కొంచెంగా అర్థమవుతోంది. అందుకే, కవిత్వాన్ని గురించి ఎన్ని భాషలున్నాయో, ఎంత మంది కవులున్నారో అన్ని నిర్వచనాలూ, అన్ని దృక్కోణాలూ! వొక నిర్వచనం ఇంకో నిర్వచనంతో కలవాలని లేదు, తలపడాలనీ లేదు. అవి వొక దానితో కలిసి ఇంకోటి సహప్రయాణం చేస్తాయి. మన సహానుభూతిని కోరుకుంటాయి.

మిత్రుడు రవి వీరెల్లి కవిత్వం చదవడం వ్యక్తిగతంగా మొదటి నించీ నాకు వొక మంచి అనుభవం. ఈ 'మంచి'నీ, ఈ 'అనుభవాన్ని' ఎట్లా చెప్పాలీ అన్న ఆలోచన ఇప్పటిది కాదు. బహుశా, రవి మొదటి కవిత చదివినప్పటినించీ నా లోపల మొదలయ్యింది. ఆ వాక్యాల మొదటి రూపు నించి ఇప్పటి రూపాల మధ్య సాగుతున్న యాత్రలో రవిలో వొక నిజాయితీ కనిపిస్తుంది, వొక తపన వినిపిస్తుంది. వొక దప్పిక తీరనితనం ప్రతి పదంలో చలి మంట సెగలా తాకుతుంది. కాబట్టి, ఇక్కడ రవి కవిత్వం గురించి నేను చెప్పాలనుకుంటున్న విషయాలు వొక సహకవిగా చెప్పడం లేదు, విమర్శకుడిగా అంతకంటే కాదు. రవి కవిత్వానికి పాఠకుడిగా చెబ్తున్నవే !

## 2

ఈ కవిత్వం చదువుతున్నంత సేపూ వొక వూహా వాస్తవ చిత్రం నా కళ్ళ ముందు మెదులుతూనే వుంది.

అది నా చిత్రమే అని నాకూ అనిపిస్తుంది. మీకూ అనిపిస్తుంది. వొక పది పన్నెండేళ్ళ పిల్లాడు ఆకాశంలోకి పతంగిని ఎగరేస్తున్న దృశ్యం అది. అది ఆముదాల పల్లెలో ఆరు బయలో, కరీంనగరులో మిద్దె మీదో, హైదరాబాద్ లోని ఏడంతస్తుల మేడో, ఇప్పుడు రవి

వుంటున్న వర్జీనియాలోని రోనోక్ అనే నగరమో కావచ్చు. (రవి జీవితంలో కానీ, కవిత్వంలో కానీ ఈ నాలుగు చోట్లు కనిపించకపోతే ఆ దృశ్యం అసంపూర్ణంగా మిగిలిపోతుంది). ఆ పతంగిని ఎగిరేస్తున్న చేతులు వొక నల్ల పిల్లాడివో, తెల్ల అమ్మాయివో, గోధుమ వర్ణపు యువకుడివో కావచ్చు. కానీ, ఆ చేతుల్ని ఎగిరేస్తున్న ఆనందమూ, ఉత్సాహమూ ఎక్కడయినా వొక్కటే! ఆ పతంగి నింగి దూరాలు విజయవంతంగా కొలుస్తున్నప్పుడు పొంగే ఉత్సాహానికీ, ఎక్కడో పేంచ్ పడ్డప్పుడు క్రుంగదీసే నిరుత్సాహానికీ భాష ఒక్కటే! ఈ పతంగి పయనాన్ని నిర్వచించే సూత్రం వొక్కటే! ఏ ఆకాశ మధ్యమో దాని లక్ష్యం. కానీ, దాని కళ్ళు నేల మీద! దాన్ని నడిపించే చేతులు నేలమీద! అనుక్షణం నేలతో ముడిపడిన బంధం అది. నా దృష్టిలో కవిత్వం కూడా అంతే! నేల నించి నేర్చుకునే పాఠాలే కవికి కవిత్వం నేర్పుతాయి. నింగి అంచులు చూడాలనే తపనలే కవి వూహలకి పొలిమేరలవుతాయి. ఈ రెండీటీ మధ్య పతంగి ప్రయాణం రవి కవిత్వ "దూప".

చాలా యాదృచ్ఛికంగా రవి కవిత్వం ఇక్కడ 'ఎదురు చూపు'తో మొదలయ్యింది. ఈ కవిత వొక పాత గురుతుని విడిచిపెట్టలేనితనం నించి 'నువ్వొస్తావన్న ఆశ'కి ఎదురు చూపు అవుతుంది. చివరికి 'మట్టి కుండ'లో

నిండిన నీళ్ళ కుండెత్తుకుని
వెనక్కి తిరగకుండా
కట్టెల చుట్టూ తిరుగుతున్న
వొ కొడుకా
కుండ జర పైలం.

అనే వాక్యాలతో ముగుస్తుంది. ఈ మధ్య రవి ప్రతి కవితా వొక గాలి అల. వాటన్నిటిని దాటుకునీ, ఎదురీదీ ఆకాశంలో ఎగిరే పతంగి రవి చెప్పాలనుకున్న భావం.

ఈ కవితల్ని నడిపించే పాత్రలు రెండు : నువ్వు–నేను. ఇక ఈ కవితల్ని చదవాల్సిన సందర్భాలు కనీసం మూడు– వొకటి : రవి దాటి రాలేని ఆముదాల పల్లె, రెండు : అనివార్యంగా దాటుకుంటూ వచ్చినా, హాయిగా గుండెకి హత్తుకున్న ఇంకో ప్రపంచం, మూడు : ఆ రెండిటికి నడుమ పట్టు తప్పని అంతరంగం. కాస్త పండిత భాషలో చెప్పాలంటే, home, diaspora and subjectivity. బహుశా, ఈ మూడు సందర్భాల్ని, వాటి దూరాల్ని నిరంతరం కలిపే పాత్రలు – నువ్వూ నేను. నాకు అర్థమయినంత వరకూ రవి ఈ కవిత్వంలో వొక కొత్త సామూహికతని ఆవిష్కరిస్తున్నాడు. అందుకే, ఇందులో కనిపించే 'నువ్వూ–నేను' అనే పాత్రలు వాటి వాటి వ్యక్తిగత పరిమితుల్ని దాటి 'మన'తనాన్ని బహిర్గతం చేస్తాయి. రవి ఎగిరేస్తున్న కవిత్వ పతంగికి ఇదీ దారం అని తెలిశాక, రవి కవిత్వంలోకి వెళ్ళడం నాకు కాస్త తేలికయింది. ఆ మాటకొస్తే, నిగూఢంగా రాయడం రవి లక్షణం కానే కాదు,

చాలా గాఢంగా రాసిన వాక్యాలు కూడా రవి కూర్పులో అవి మన వాక్యాలుగా, మనల్ని అక్కున చేర్చుకునే ఆత్మీయ భావాలుగా మారిపోతాయి.

ఈ కవిత్వంలో మొదటి సందర్భం : ఆముదాలపల్లె. ఇప్పటికీ రవి ఇల్లు అదే అనిపిస్తుంది ఈ ప్రతి పుటలో ! రవి ఈ వూరిని గురించి చెప్పిన ప్రతి చోటా అది నా వూరు కూడా అనిపిస్తుంది. దానికి కారణం పట్టణీకరణతో తలపడుతున్న వూళ్ళ బాధలు వొక్క తీరుగా వుండడమే. రవి అందిస్తున్న వర్ణనలు కేవలం పల్లెకి వొక వేపు మాత్రమే చూపించవు. పల్లెని ఒక 'కాల్పనిక' వస్తువుగా మార్చకుండా, ఆ పల్లెలోని వర్తమానికతని పట్టుకునే ప్రయత్నం చేస్తాడు రవి. ఉదాహరణకి ఈ వాక్యాలు :

ఆ గదిలో కాస్త / ఈ గదిలో కాస్త / ఆయాసపు శ్వాస చిలకరించి / ఆ గోడకు ఈ గోడకూ / మాసిపోయి మిగిలిన గుర్తులను ప్రేమతో తడిమి / జ్ఞాపకాల గడంచ వాల్చింది / వలసమంటల్లో కంటిపాపలు కాల్చుకున్న పల్లెతల్లి.

"తలసుంచులు ఊపుకుంటూ / ముచ్చట్లకు చెవికోసుకుంటూ / చేను."

నీ ప్రగతి రథచక్రాల తొక్కుడులో / పగిలి ముక్కలవుతున్న నా పచ్చని నవ్వుని అతికించవూ... / నాలుక తడుపుకోడానికి కాసిన్ని నీళ్ళయినా కురుస్తాయి.

అభివృద్ధిలోని అసమానతల వైరుధ్యం చూడలేకపోతే ఈ పల్లెల వర్తమానికత మన తలకెక్కనట్టే లెక్క. ఈ వర్తమానంలో మనం ఎంత వరకు బతుకుతున్నామనే ప్రశ్న కూడా ఇక్కడ తప్పదు. దగ్గిరగా వున్నప్పుడు కనిపించని వెలితి దూరంగా వున్నప్పుడు స్పష్టంగా గీటు గీసినట్టుగా కనిపిస్తుంది.

ఈ దూరం నిజానికి దూరం కాదు. ఈ కొత్త సందర్భం రవి కవిత్వంలోని ఇంకో ఇరుసు. రవికి ఈ పల్లె బతుకుతో పాటు ఇంకో అంతర్జాతీయ అస్తిత్వం కూడా వుంది. ఇంటర్నెట్ యుగం దూరాన్ని వేరే రకంగా నిర్వచిస్తుందన్న వాస్తవం అట్లా వుంచితే, దూరాల్నీ, దగ్గిరనీ కొలవడానికి ఇప్పుడు మానసిక కొలమానాలు కూడా వేరే కావాలి. నిజంగా పల్లెలో వున్న మనిషి లేదా ఆ నిజ సందర్భాల్లో వున్న వాళ్ళు ఎంత నిజాయితీ స్వచ్ఛంగా ఆ పరిస్థితుల్ని 'చూడ' గలరన్నది ప్రశ్నార్థకమే. పక్కనే జరుగుతున్న మార్పులు మన కంటిని తప్పించుకు పోవడం ఇప్పుడు మనం చూస్తున్నదే. దీనికి భిన్నంగా ఇంటికీ, ప్రవాసానికీ మధ్య తన అస్తిత్వాన్ని కాపాడుకునే తపన రవిలో వుంది. ఆ దూరాన్ని కచ్చితంగా గుర్తించడమే కాకుండా, దాన్ని ఎప్పటికప్పుడు చెరిపేసుకుంటూ వెళ్ళే దప్పిక కూడా రవికి వుంది. ఈ ప్రవాస దూరం గురించి రవి అంటాడు :

చేదవేసి తోడుకోలేనంత దూరంలో ఎక్కడో / నువ్వు.

తెంపుకొచ్చిన పేగు బంధాన్ని / దాటుకొచ్చిన అనుబంధాలను / ఖననం చేసి కట్టుకున్న / ఈ ప్రవాసపు పునాదులు / ఎప్పటికైనా పెగలాల్సిందే.

ఈ రెండు సందర్భాల్నీ కలగలిపిన మూడో సందర్భం, రవి కవిత్వానికి వెన్నెముక నిచ్చిన లక్షణం : subjectivity. ఆత్మాశ్రయం అనే భావన ఇప్పటికే తెలుగు సాహిత్యంలో వుంది. కానీ, గత కొంత కాలంగా నాకు ఈ భావన మీద అభ్యంతరాలు మొదలయ్యాయి. వర్తమాన సాహిత్యంలోని 'నేను'ని, పూర్వ సాహిత్యంలోని 'నేను'తో పోల్చలేమని నాకు అనిపిస్తోంది. పాత కవిత్వంలో 'నేను' వ్యక్తిగతాన్ని magnify చేస్తుంది. కానీ, కొత్త సాహిత్యంలో ఈ కొత్త 'నేను'లో వైయక్తికతని తుడుచుకుంటూ వెళ్ళే ప్రక్రియ (erasure). ఆ దశలో ఇందులోని 'నేను' వ్యక్తి కేంద్రిత్వాన్ని పోగొట్టుకొని, వొక కొత్త సామూహికతలోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రక్రియ ఎలా పనిచేస్తుందో ఇక్కడ నేను వాచ్యం చేసే కంటే, మీరు నేరుగా రవి కవిత్వంలో 'నేను', 'నువ్వు' అనే భావనల్లోకి వెళ్ళడమే మంచి అనుభవం.

ఈ కవితల్లో 'నేను' 'నువ్వు' అనే భావనలు ఎందుకు పునరుక్తి అయ్యాయా అని వెతుక్కుంటూ వెళ్ళినపుడల్లా రవి నాకు ఆ రెండు భావనల చుట్టూ ప్రతి సారీ వొక కొత్త సామూహికతని నిర్మిస్తూ వచ్చాడని అర్థమయింది.

## 3

తెలుగు కవిత్వం అనేది ఇప్పటికీ మధ్యతరగతి సొత్తుగానే వుంది. మధ్యతరగతి వొక సంకుచితమయిన 'నేను'ని తెలుగు కవిత్వంలో అలవాటు చేసింది. ఈ సంకుచిత 'నేను' ఇటీవలి ప్రపంచీకరణ తరవాత మనం వున్న వూళ్ళోనే వొక చిన్న అమెరికాని వూహించుకుంటుంది. రూపాయిని డాలర్ లోకి అనువదించుకుంటుంది. అనుబంధాల్ని disposable చేస్తుంది. స్నేహాల్ని ఎలా చెలామణీ చెయ్యాలో నేర్పుతుంది. మనిషిని వస్తువుగా మాత్రమే నిలబెడుతుంది. ఈ మొత్తం వ్యవస్థలో 'నేను' వొక showpiece.

వీటన్నింటికి భిన్నంగా రవి ఏం చేస్తున్నాడో చూడండి. అమెరికాలో వొక 'ఆముదాలపల్లి'ని కట్టుకుంటాడు. డాలర్ చూపులోంచి కాకుండా, "ఎవరో 'రీవైండ్' బటన్ నొక్కినట్టు / కండెకు చుట్టుకుపోయిన / కలల" కంట్లోంచి బయటికి చూస్తాడు. అనుబంధాలకి ప్రాణ ప్రతిష్ట చేసి, ప్రతి మనిషిలో ప్రతి మాటలో వాటి వూపిరి భాషని వెతుక్కుంటాడు. స్నేహమనేది చెలామణీ సరుకు కాదనీ, అది మనసు లోపలి దూప తీర్చే ప్రాణ ధార అని చెప్తాడు. మనిషిని మనిషిగా నిలబెడ్తాడు. ఈ మొత్తం వ్యవస్థ 'నేను' 'నువ్వు'ల మధ్య 'మన' వంతెన కావాలని ఎదురు చూస్తాడు.

చివరగా వొక్కటే మాట :

మీ దూప తీర్చే దోస్తు ఈ పతంగిలో వున్నాడు. వొక నిండయిన ఆకాశంలోకి మీ గుండెని ఎగరెయ్యండి!

మే 26, 2012

**– అఫ్సర్**

## దూపతో....

గతం దిగుడు బావి దిగుతూ వెళ్తే చిట్ట చివరి మెట్టు మీద పుట్టి పెరిగిన ఊరు కనిపిస్తుంది. రాళ్ళ దుక్కి దున్ని, మోకాలు లోతు మడికట్టులో నాటేసి, వచ్చిరాని కరెంటుతో రాత్రంతా చేనుకు నీళ్ళు పెట్టి, పగలూ రాత్రులను నాలుగు అన్నం మెతుకులుగా మలిచి, ఇంట్లో ఇద్దరి పిల్లల కడుపు నింపిన అమ్మ, బాపూ కళ్ళముందు మెదులుతారు. దిగువకు దిగువ మధ్యతరగతి రైతు కుటుంబం మాది. అమ్మ రాజేశ్వరమ్మ, బాపు కొమురారెడ్డి, అన్న మహేందర్, వూరు ఆముదాలపల్లి, ఇదే నా చిన్ననాటి ప్రపంచం. విరిగిన తెలంగాణా గడిగోడల మధ్య వయసుడిగిన పెంకుటిల్లు మా వూరి బడి, నా నాలుక మీద నాలుగక్షరాలు రాసిన బడి. ఇక్కడే ఐదవ తరగతి వరకు చదివి, రోజూ వాగు దాటుతూ రెండు మైళ్ళు నడిచి పదవ తరగతి వరకు పక్కూర్లో చదివా. చిన్నతనమంతా చెప్పుల్లేకుండానే గడిచింది. ఎండాకాలం ఒంటి పూట బడి కోసం మైళ్ళు నడిచినప్పుడు ప్రపంచంలో అందరూ నాలాగే చెప్పుల్లేకుండా నడిచి బడికి పోతారేమో అనుకునేవాణ్ణి. అందుకే పేదరికం అంటే ఏమిటన్న ప్రశ్న ఆ రోజుల్లో ఎప్పుడూ కలగలేదు.

రోజూ నన్ను పక్కూరి బడికి చేర్చే పిల్లబాట వర్షాకాలం రాగానే విరిగి రెండు ముక్కలయి ప్రశ్నించేది. చిరిగిన వరుకు పుస్తకాల సంచి నెత్తినేసుకుని వాగు దాటుతూ జీవితం లోతులు ఎలా ఈదాలో బహుశా ఇక్కడే నేర్చుకుని ఉంటా. ఈ వాగు వొడ్డున తోడిన చెలిమెకు సాష్టాంగపడి తాగిన తియ్యని నీళ్ళు, సోపతిగాళ్ళతో ఆడిన పిల్లిగీతలాటలో నేర్చుకున్న ఎక్కాలు, చీకట్లో గబ్బిలమై కనిపెట్టిన మా వూరి కొండ సొరికెలు, పాముందో పీతుందో తెలియని రేగడి మడిఒడ్డు రంధ్రాల్లో మోచేతి వరకు చెయ్యి దూర్చిన సాహసం, కోనప్పనూతి చిమ్ములెక్కి దునికి నీటి అట్టడుగు నుండి పిడికిట్లో పట్టి తెచ్చిన మట్టి వాసన, ఎడ్లను కాయడానికి ముళ్ళకర్ర ఎలా విసరాలో, పశువుల భాష ఎలా మాట్లాడాలో నేర్పిన శంకరిగాడు, నోట్‌బుక్ పుటలతో పందెం కాసి పత్తాలు ఆడిన అమాయకత్వం, ఇసుకదిబ్బల్లో ఆడిన కాశీపుల్ల ఆట, కోఅంటే పలికే కొండా, కూ అంటే పలికే కోయిలా, మత్తడెక్కి లాలకు పిలిచే చెరువూ, ఇవన్నీ తలుచుకుంటే ముచ్చటేస్తుంది. పల్లెటూళ్లో పుట్టినందుకు

ఒకింత గర్వంగా కూడా అనిపిస్తుంది. సుఖాలూ, దుఃఖాలూ, ఆనందాలు, అవమానాలు అన్నీ కలెగలిసిన ఆ చిన్న నాటి ప్రపంచంలో నేను తిరగని తొవ్వ లేదు. ఈదని బావి లేదు.

కవిత్వం అంటే చిన్నప్పటి నుంచే చాలా ఇష్టం. పల్లె బడుల్లో పది వరకు, మరో పల్లె లాంటి టౌన్‌లో ఇంటర్ మీడియెట్ చదివి, ఇంజనీరింగ్ చదువు కోసం ఏడుస్తూ పల్లె విడిచి పోవడం, ఆ తర్వాత ఇంగ్లీష్ చదువు కష్టాలు, అప్పటికే ఉన్నవన్నీ అమ్మి నన్నూ అన్నను చదివించిన అమ్మా బాపును ఇంకా కష్టపెట్టడం ఇష్టం లేక వెంటనే ఉద్యోగంలో చేరడం, సుచరితతో ప్రేమ, పెళ్ళి, ఆ తర్వాత అమెరికా ప్రయాణం, రెండు భుజాల నిండుగా ఇద్దరు పిల్లలు అభినవ్, అపూర్వ్ లతో, ఇలా ఎప్పటి నుండో మనసులో నిగూఢంగా గాఢంగా కవిత్వం రాయాలన్న తపన ఉన్నా సరయిన అవకాశమూ సమయమూ దొరకక, ఇదిగో ఇప్పుడు నడివయసుకు దగ్గర్లో, నలభైనాలుగేళ్ళకు ఆ దూప తీర్చుకుంటూ...

పోయిన రెండేండ్ల లో చేసిన నా సాహిత్య యాత్రకి అక్షరరూపం నా ఈ మొట్టమొదటి సంకలనం.

అనుభవిస్తే కాని అర్థం కాని కల, జీవితం.

మైళ్ళకు మైళ్ళ పొడవుండి, దిగంతాలను తాకే కల, కవిత్వం.

కవిత్వం నాకొక తీరని దూప. నన్ను నేను కనిపెట్టుకోవాలనే తపనే నా దూప.

ఉన్నట్టుండి కోల్పోయి, మళ్ళీ నన్ను నేను పొందటానికి, కవిత్వపు చేంతాడుకు జ్ఞాపకాల బొక్కెన కట్టి అలా కాలంలోకి విసిరి ఆర్తిగా తోడుకుంటాను. ఒకడుగు ముందుకు వేసి, జారిన ఏదో జ్ఞాపకాన్ని పట్టుకోవాలని ఒకడుగు వెనక్కి వేసి, ఎప్పటికీ ఉన్న చోటే మేల్కొంటాను. వుదయాన్నించి బైనరీకోడ్లలో బతుకుదెరువు వెదుకుతూ, సీషార్ప్ ప్రోగ్రామును పొయెట్రీ లా రాస్తూ సాయంత్రం  కాగానే చీకటి చిమ్ములెక్కి రాత్రిలోకి దూకి అట్టడుగు పొరల్లో నన్ను నేను కనుక్కోడానికి ప్రయత్నించి, గాయపడి, నిరాశపడుతూ మళ్ళీ ఉదయంలో మేల్కొంటాను. జవాబులన్నీ ప్రశ్నల్లా, ప్రశ్నలన్నీ జవాబుల్లా, ఎటూ తేలని ఎన్నో చిక్కుప్రశ్నలు వో చిన్న పద్యాన్ని ఎప్పటికీ పూర్తి చెయ్యలేవని తెలిసి కూడా, ఏవో రెండు అసంతృప్తి వాక్యాలతో వొక పద్యాన్ని మూసి, మరో పద్యాన్ని తెరిచి, అసంతృప్తి లోనే ఆనందపడుతూ, ఇలా నేను రాసిన ఈ నాలుగు కవితలు మీతో పంచుకోవాలన్న ఆశతో, స్వార్థంతో, అసంతృప్తిగా, అసంపూర్తిగా ఇలా...

**- రవి వీరెల్లి**

## ఈ దారిలో...


| | |
|---|---|
| ఎదురుచూపు | 13 |
| నాలో నేను | 14 |
| నశ్వరం | 15 |
| శోధన | 17 |
| ఆవృత్తి | 18 |
| విముక్తి | 19 |
| కాసిన్ని నీళ్లయినా | 20 |
| మరిచిన చిరునామా | 21 |
| తోడున్న ఒంటరి | 23 |
| అప్పుడు పుడతాను | 24 |
| ఏ పుట్టుకా వద్దు ! | 25 |
| స్టిల్ లైఫ్ | 27 |
| జ్ఞాపకం | 28 |
| పుట్టగొడుగులు | 29 |
| నేనూ.... ఓ ఉదయం | 30 |
| కాలం చివర | 32 |
| వో నాలుగు | 35 |
| పూల అంగి | 36 |
| కాలం కంటబడకుండా | 38 |
| కలల ముగ్గు | 40 |
| రాత్రిని ఎదిరించి | 42 |
| జొన్న చేను | 44 |
| కానుక | 46 |
| ఏం రాస్తాం ? | 47 |

| | |
|---|---|
| దిగులు దిగుడు బావి | 49 |
| యజమాని... బానిస | 50 |
| వాన | 51 |
| వలస | 52 |
| డీల్ | 54 |
| కాలిబాట | 55 |
| కారడవిలో | 58 |
| ఎండాకాలం సెలవులు | 59 |
| కొలమానం | 61 |
| ఖాళీతనం | 63 |
| మరక | 65 |
| ఇగవటు సూరన్నా | 67 |
| ఇక్కడ | 69 |
| ఎప్పట్లాగే నువ్వొస్తుంటావులే !? | 71 |
| గుడ్డీగ | 73 |
| మట్టికుండ | 74 |

## ఎదురు చూపు

నీ తలపు
ఎక్కడో పచ్చికబయల్లో పారేసుకున్న మన పాత గురుతులని
ఎదకు ఎరగా వేసి పద పదమని పరుగు పెట్టిస్తుంది

నీ ధ్యాస
స్మృతుల శ్రుతిలో స్వరాలాపన చేస్తున్న నా హృదయ లయను
గమకాల అంచుల్లో తమకాల ఉయ్యాలలూపుతుంది

నీ ఊహ
మొగ్గలా ముడుచుకున్న జ్ఞాపకాలని బుగ్గరించి విరబూయించి
అనుభవాల రెక్కల చిరుజల్లుగా చిలకరిస్తుంది

నువ్వొస్తావన్న ఆశ
నిశ్చల నీలి సంద్రంలా నిద్దరోతున్న నా మదిని
ఊరించే కోరికల పెను ఉప్పెనలో ముంచెత్తుతుంది

ఇదిగో
కాలం వదిలివెళ్ళిన జ్ఞాపకాల నీడల్లో
నీకై ప్రతీక్షించే నాకు వృద్ధాప్యం వచ్చిన అలికిడే వినిపించలేదు
నీ ప్రేమే ప్రేరణై
నీ తలపే ప్రాణమై
నీ ఊసే ఉపలాలితమై
తన ప్రతీ స్పందనలో నీకై పరితపించే నా గుండెకు
ఇంకా ఆశల కొన ఊపిరిలూదుతూనే ఉన్నా. ■

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=987**

* * *